కథ

# నిజాయితీ

ఆటోరిక్షా దిగి డబ్బులిచ్చి నిలబడ్డారు రామారావు మాస్టరుగారు ఆ ఆఫీసుముందు.

వాచీ చూసుకున్నారు.

టైమ్ తొమ్మిదిన్నరయింది.

'ఆఫీస్ తెరవడానికి యింకో అరగంట సమయం ఉంది' అనుకుంటూ ఎదురుగా ఉన్న హోటల్కెళ్లి కాఫీకి ఆర్డరిచ్చి కూర్చున్నారు రామారావు మాస్టర్గారు.

రామారావుగారు రిటైరై అయిదేళ్లు దాటింది. రిటైరైన తర్వాత యిద్దరాడపిల్లల పెళ్లిళ్లు జరిపించారు. అయితే అబ్బాయి విశ్వం పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినా యింతవరకూ ఓ ఉద్యోగస్థుడు కాకపోవడంతో యింటి బాధ్యత యింకా మోయక తప్పింది కాదు మాస్టర్గారికి. ఈ నాలుగయిదేళ్లలో చాలా ప్రయత్నాలు చేసినా యింకా నిరుద్యోగిగానే మిగిలాడు విశ్వం. కొడుకు స్థిరపడలేదనే మాస్టర్గారి బెంగంతా!




విశ్వం రెండు రోజుల క్రితం యిక్కడికి యింటర్వ్యూ ఇవ్వడానికి వచ్చాడు. అతనికి ఈ సంవత్సరంతో ప్రభుత్వోద్యోగానికి వయసు అయిపోతుంది. ఇదే ఆఖరి ఛాన్స్! ఇది తప్పితే మరి ప్రయివేట్ జాబ్ చూసుకోవలసిందే! అయితే ఇంటర్వ్యూ బాగా చేసానని, తనకి తప్పక ఉద్యోగం వచ్చి తీరుతుందని విశ్వం గట్టి నమ్మకం.

మాటల ప్రస్తావనలో రామారావు మాస్టర్గారు, తన మిత్రుడు, తోటి మాస్టరైన రామనాథంగారి వద్ద విశ్వం ఉద్యోగ ప్రయత్నం గురించి చెప్పబోతే, అతను యిలా అన్నాడు.

''రామారావుగారూ! మీరు ఏమీ అనుకోనంటే ఒక మాట! ఇవాళ రేపూ, గవర్నమెంట్ ఉద్యోగాలు కేవలం ప్రతిభ వల్ల వస్తుందని అనుకుంటున్నారా! అలాగైతే, మీ విశ్వానికి ఎప్పుడో ఉద్యోగం వచ్చి ఉండేది! ఈ కాలంలో ఎలాంటి ఉద్యోగానికైనా ఉత్తర దక్షిణాలు లేనిదే పని జరగదు. మీరు, నీతి-నిజాయితీ అని చూస్తూ కూర్చుంటే ఇంతే మరి! ఏజ్ బారైపోతే, ఇక ఏ ప్రైవేట్ ఉద్యోగాలో, లేక సొంతంగా ఏ వ్యాపారమో చూసుకోవలసిందే మరి.''

నిస్పృహగా చూసారు రామారావు మాస్టర్గారు.

''అంతేనంటరా రామనాథంగారూ! అయినా నా మనసెందుకో అందుకు అంగీకరించడం లేదు'' అన్నారు.

''నిస్సందేహంగా! ఇప్పటికైనా మీ నీతి నియమాలు పక్కనపెట్టి ఈ ఒక్కసారికి ప్రయత్నం చేయండి. ఏమాత్రం యివ్వగలరో ఆ ఆఫీసర్ని కలిసి చెప్పండి. దానివల్ల మీ పని సానుకూలపడొచ్చు'' అన్నారు రామనాథంగారు.

ఐనా రామారావుగారికి ఎందుకో ఆ మాటలు



అప్పుడు రుచించలేదు. అయితే ఆ రాత్రి ఆ విషయమై పదే పదే తనలో తానే తర్కించుకోసాగారు. పోనీ ఈ ఒక్కసారికి రామనాధంగారు చెప్పినట్లు చేస్తే, తలతాకట్టు పెట్టైనా ఏ అప్పోసొప్పో చేసి ఉద్యోగం సంపాదిస్తే! ఐతే తను నీతి, నియమాలకి తిలోదకాలు యివ్వాల్సిందేనా? తన స్టూడెంట్సుకు ఆదర్శంగా నిలిచిన తను యిలాంటి పని చేయగలడా! తన విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలిచి, నీతి నిజాయితీలు తప్పకుండా, సిన్సియర్ మాస్టర్‌గా పేరు తెచ్చుకుని రిటైరైన తను, తప్పుదారి పట్టవచ్చా! తన వద్ద చదువుకొన్న వాళ్లెందరో ఈరోజు మంచి ఉద్యోగంలో ఉన్నారు. వాళ్లకేకాక, తనతోటి ఉద్యోగస్థులకి తను మార్గదర్శకుడుగా ఉండేవాడు. తనలో తానే చాలా మథనపడి, తన మనస్సాక్షి అంగీకరించకపోయినా, కొడుకుని ఓ ఉద్యోగస్థుడిని చేయాలని నిర్ణయించుకున్నారు. పరిస్థితుల ప్రాబల్యం అటువంటిది మరి! అయితే ఈ విషయం విశ్వంకి మాత్రం తెలియనివ్వకూడదని నిశ్చయించుకున్నారాయన. ఆలోచనల్లోంచి తేరుకొని, సర్వర్ తెచ్చిన కాఫీ తాగి వాచీ చూసుకున్నారు రామారావు మాస్టర్‌గారు. సమయం పది దాటింది. కౌంటర్‌లో బిల్ పే చేసి, ఆఫీసు వైపు కదిలారు. ఆఫీసు అప్పటికే ఉద్యోగులతో, తమ తమ పనులమీద వచ్చిన వాళ్లతో సందడిగా ఉంది.

మెల్లగా ప్యూన్‌తోమాట్లాడి, ఆఫీసర్ వద్దకు వెళ్లడానికి అప్పాయింట్‌మెంట్ సంపాదించాడు. వెంటనే పిలుపు వచ్చింది లోపల్నుంచి.

లోపలికి వెళ్లి, ఆఫీసర్‌గారికి నమస్కారం చేసారు మాస్టరుగారు. అయితే, రామారావు గారిని చూడగానే, లేచి నిలబడ్డాడు ఆఫీసర్.

''నమస్కారం మాస్టరుగారూ! మీరు బహుశా నన్ను గుర్తు పట్టలేదనుకుంటాను! నేను రాజారావుని మాస్టారూ! మీ వద్ద చదువుకున్నాను'' అంటూ గుర్తు చేసాడు అతను.

కొద్దిక్షణాల్లో రామారావుగారికి గుర్తుకు వచ్చింది అతనెవరో! రాజారావు తన స్టూడెంట్లలోకెల్లా పట్టుదల, తెలివిగలవాడు. అతని తండ్రి పేదవాడైనా, తన ప్రోత్సాహం వల్లే చదవగలిగాడు.

''మాస్టర్‌గారూ! మీ ఆశీర్వాద బలంతోనే నేనింత వాణ్ణయ్యాను. మీరు పాఠాలు చెప్తూ మధ్య మధ్య చెప్పే నీతి కథలే మమ్మల్నెక్కువ ఆకట్టుకొనేవి. మీ బాటలోనే నడిచి, నేను ఈ స్థితికొచ్చాను'' అని ప్యూన్ని పిలిచి రెండు కూల్‌డ్రింక్స్ తెప్పించాడు.

మాస్టర్‌గారు తన శిష్యుడి ఉన్నతికి చాలా సంతోషించారు. ''చాలా సంతోషం నాయనా! నా శిష్యుల్లో నీలా పైకి వచ్చిన వాళ్లని చూసినప్పుడల్లా నాకు చాలా ఆనందం కలుగుతుంటుంది'' అన్నారు ఆనందంగా. కాస్సేపు క్షేమసమాచారాలయ్యాక,

''మాస్టరుగారూ! మా ఆఫీసుకి ఏ పని మీద వచ్చారు!'' అని అడిగాడు రాజారావు.

హఠాత్తుగా తను వచ్చిన కారణం గుర్తుకు రాగా రామారావు మాస్టర్‌గారికి తనపై తనకే విరక్తి కలిగింది. అతనితో చెప్పటానికి మాట పెగలలేదు. తన ప్రవృత్తికి విరుద్ధంగా ప్రవర్తించి తను వచ్చిన పని గురించి చెప్పాలనుకోలేదు.

రామారావుగారు సందేహించడం చూసి,

''మాస్టరుగారూ! మీరు ఏమీ సందేహించకండి! చెప్పండి. ఏ సహాయం అయినా చేస్తాను'' అన్నాడు రాజారావు.

అప్పుడు నోరు విప్పారు మాస్టర్‌గారు.

''ఏం లేదు. నాకు తెలిసిన అతను ఒకరు ఈ ఆఫీసులో ఉంటే వచ్చాను'' వాస్తవం దాచి అన్నారాయన మనఃక్షోభ భరించలేక.

''అన్నట్లు మీకో అబ్బాయి వుండేవాడు! పేరు గుర్తు రావటం లేదు. ఏం చేస్తున్నాడతను'' యధాలాపంగా అన్నాడు రాజారావు.

''అబ్బాయి విశ్వం ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు'' ఇంకేమనాలో తోచలేదు రామారావుగారికి.

వెంటనే గుర్తు పట్టాడు రాజారావు.

''ఓహో! విశ్వం మీ అబ్బాయి కదూ! అవును. అతను చాలా స్మార్ట్ అండ్ ఇంటెలిజెంట్. మొన్న మా ఆఫీసులో జరిగిన ఇంటర్వ్యూ బాగా చేసాడు. అయినా నాకెందుకు యింతవరకూ చెప్పలేదు మాస్టారూ! అతనికి తప్పకుండా పోస్టింగ్ వస్తుంది. ఇంత ప్రతిభ ఉన్న కుర్రాడికి యింతవరకూ ఉద్యోగం రాకపోవడం ఆశ్చర్యమే మరి!'' అప్పటికి మాస్టార్‌గారు వచ్చిన కారణం గురించి అతను చెప్పకపోయినా గ్రహించగలిగాడు రాజారావు.

''మీరు నిశ్చింతగా వెళ్లిరండి మాస్టారుగారూ! ఇంతకు పూర్వం సంగతేమోగానీ, యిప్పుడు కేవలం మెరిట్ ఆధారంగానే నిర్ణయం జరిగింది. నేను ఏ ప్రలోభాలకీ లొంగక, పెద్దవాళ్ల బెదిరింపులకి చలించకుండా వ్యవహరించి నిర్ణయం తీసుకున్నాను యింతకు మునుపే. మీ వాడితోపాటు యింకో నలుగురికి ఈవారం రోజుల్లోనే ఆర్డర్స్ అందుతాయి'' అన్నాడు మళ్లీ.

గుండెలమీద భారం దిగినట్లయింది రామారావుగారికి. కేవలం సొంత ప్రతిభపై విశ్వానికి ఉద్యోగం రావడం మరింత ఆనందానికి కారణమైంది. తన శిష్యుడి నిజాయితీ తన పాలిట వరమైంది. తను ఆత్మవంచన చేసుకోబోకపోవడం కూడా అమిత ఆనందాన్నిచ్చింది.

సజల నయనాలతో రాజారావుని చూసారు మాస్టరుగారు ఆనందంతో ఉప్పొంగిపోతూ!

☆

**డి.వి.డి. ప్రసాద్**

## శిల్పా సింప్లిసిటీ

పొడుగుకాళ్ల సుందరి శిల్పాశెట్టి ఇప్పుడు చాలా బిజీ తార అయిపోయింది. ఆమె అటు కన్నడం, ఇటు ఇంగ్లీష్ సినిమాల్లో నటించే ఛాన్సులు కొట్టేసి బెంగుళూరులో తెగ తిరుగుతోంది. రేవతి నిర్మిస్తున్న చిత్రంతో పాటు, మరో కన్నడ చిత్రంలో ఆమె నటిస్తోంది. తనకున్న నటనా చాతుర్యం, అందంతో మరిన్ని అవకాశాల్ని చేజిక్కించుకోవడానికి ఆమె తెగ ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. 'నాకు ఏదైనా సినిమాలో నటించే ఛాన్స్ వచ్చినా ముందు కథ, దర్శకుడి గురించి ఆలోచిస్తాను' అని చెప్పే శిల్పా పునీత్ ఇస్సార్ కొత్త చిత్రంలో వార్తల్లో వ్యక్తి అయిన సల్మాన్‌ఖాన్ సరసన నటిస్తోంది. బాలీవుడ్, కన్నడ చిత్రాల్లో నటించే అవకాశం వచ్చినా తన సింప్లిసిటీని మాత్రం వీడడంలేదు.